సాక్షి నారాయణపేట

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



అంతా మా ఇష్టం..
సెజ్‌లో ఫార్మా పరిశ్రమల నిర్వాహకులు యథేచ్ఛగా వ్యర్థాలు బయటకు వదులుతున్నారు.
వివరాలు 8లో ▸



జూరాలకు భారీ వరద
జూరాల ప్రాజెక్టుకు గురువారం ఎగువ నుంచి 2.01 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.5 /22.5
ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట రూరల్: హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతాపూర్‌లో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి జిల్లాలోని గిరిజన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2025–2026 విద్యా సంవత్సరంలో డే స్కాలర్ విధానంలో ప్రవేశానికి 01-06-2018 నుంచి 31-05-2019 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించకూడదని, కుల, ఆదాయ, పుట్టిన తేదీ ధ్రువపత్రాలు, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించుకొని 8వ **తేదీలోగా మహబూబ్‌నగర్** కార్యాలయంలో **అందజేయాలని** పేర్కొన్నారు. ఈ నెల 13న లా**టరీ విధానంలో** ఆరుగురిని ఎంపిక చేయనున్న**ట్లు తెలిపారు.**

నేతన్నలు దరఖాస్తు చేసుకోండి

నారాయణపేట: చేనేత కార్మికుల **సంక్షేమానికి** ప్రభుత్వం నేతన్న భరోసా, నేతన్న భద్రత పథకాలు అమలు చేస్తోందని.. అర్హులైన నేత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి డి.బాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. నేతన్న భరోసా పథకంలో నమోదైన కార్మికులకు ఏడాదికి రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.6 వేలు మంజూరవుతాయని.. నేతన్న పొదుపులో నమోదైన కార్మికులు, అనుబంధ కార్మికులు ఆయా పథకాలకు అర్హులని పేర్కొన్నారు. అర్హులందరూ 5వ తేదీలోగా కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, గతేడాది నేతన్న బీమా పథకంలో నమోదైన చేనేత కార్మికులు దరఖాస్తు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


బలవంతపు భూ సేకరణ వద్దు



నారాయణపేట: పేట–కొడంగల్ ఎత్తిపోతలలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వకుండా గత పాలకుల మాదిరిగా బలవంతంగా భూ సేకరణ చేపట్టవద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య ప్రభుత్వాన్ని కోరారు. భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే దీక్షలు గురువారం 17వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి రైతులకు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం మొండిగా ఎకరా రూ.14 లక్షలకు సేకరించి రైతుల కడుపుకొట్టడం సరికాదన్నారు. భూ నిర్వాసితులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని.. తప్పించుకోవాలని చూస్తే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు రైతులకు సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని భయపెట్టడం చూస్తే గత పాలకులకు పట్టిన గతే పడుతుందన్నారు. ఇకనైనా అధికారులు భూ నిర్వాసిత సంఘం ప్రతినిధులతో చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఎడవెల్లికి చెందిన భూ నిర్వాసితులు అంజప్ప, లక్ష్మణ్, నర్సింహులు, కిష్టప్ప, హన్మంతు ,శ్రీనివాసులు, బాలప్పతో పాటు భూ నిర్వాసిత సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, మశ్చందర్,బాల్‌రాం, మహేష్‌కుమార్‌గౌడ్, ధర్మరాజు, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

వినూత్న బోధనతో ఆకట్టుకోవాలి

నర్వ: సులభంగా అర్థమయ్యేలా వినూత్న బోధనతో విద్యార్థులను ఆకట్టుకోవాలని ఏఎంఓ విద్యాసాగర్ సూచించారు. గురువారం మండలంలోని పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బయోసైన్స్‌పై విద్యార్థులు ఆసక్తికనబర్చేలా బోధనను కృత్యాలతో చేసి చూపించాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాఠశాలల్లో సైన్స్‌పై కృత్యాలను విద్యార్థులతో చేయించేలా ప్రోత్సహించాలన్నారు. పదోతరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ఓ లక్ష్యంతో చదివేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు భానుప్రకాష్, శ్రీనివాసులు, కాంప్లెక్స్ జీహెచ్ఎం భాగ్యలక్ష్మి, సీఆర్పీ నర్సింహులు, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





తాను నివసిస్తున్న పెంకుటిళ్లును చూపిస్తూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్న ఈ మహిళ పేరు సాధమ్మ. ఆమె భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. దీంతో ఆమె వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలోని ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన ఇంట్లో తల్లి శాంతమ్మతో కలిసి నివాసం ఉంటోంది. ఇది మా ఇల్లు.. వర్షం వస్తే కురుస్తది.. గోడలు ఎప్పుడు పడిపోతాయో తెలియదు.. అని గోడు వెళ్లబోసుకుంది. అధికారులు సర్వేకు వచ్చినప్పుడు ఇల్లు ఉందని రాసుకోవడంతో మాకు ఇందిరమ్మ పథకం వర్తించలేదని వాపోయింది. స్థానిక అధికారులు, నాయకులతో మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని.. ఎమ్మెల్యే స్పందించాలని వేడుకుంటోంది.



నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన అలివేలు కుటుంబం 20 ఏళ్లుగా పూరి గుడిసెలో నివాసం ఉంటోంది. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పక్కా ఇల్లు మంజూరు కాలేదు. నాయకులు, అధికారులను సంప్రదించినా ఎలాంటి ఫలితం లేదు. ఎంతో మందికి ఎక్కువ పొలం, వాహనాలు ఉన్నప్పటికీ ఇళ్లు మంజూరయ్యాయని.. తమకు మాత్రం ఇల్లు ఇవ్వలేదని అలివేలు - అంద్రయ్య దంపతులు వాపోతున్నారు.

గూడు.. తీరొక్క గోడు!

'ఇందిరమ్మ ఇళ్ల'లో కొర్రీలు

- అడ్డంకిగా మారిన పలు నిబంధనలు
- పక్కా ఇళ్లలో అద్దెకున్న వారికి వర్తించని పథకం
- 600 ఎస్‌ఎఫ్‌టీలలోపే అనుమతితో పలువురు దూరం
- అర్హుల జాబితాలో చేర్చి.. ఆపై తీసేయడంతో ఆందోళన





శిథిలావస్థకు చేరిన గోడలు, ముందు రేకుల ఇంటి ఎదుట దీనంగా ఉన్న ఈ మహిళ పేరు మాధవి. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ పరిధి రాజోళి మండలంలోని పచ్చర్లకి చెందిన ఆమె ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్థిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల తొలి జాబితాలో తప్పకుండా మీ పేరు ఉంటుందని నాయకులు, అధికారులు చెప్పడంతో పాతబడిన గోడలను మొత్తం కూల్చేసుకుంది. తీరా వచ్చిన జాబితాలో పేరు లేకపోవడంతో ఆమె కంగుతింది. నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించకపోవడంతో ఆందోళనలో కొట్టుమిట్టాడుతోంది. 'మాది చిన్న మట్టి మిద్దె. ఎలాగూ ఇల్లు వస్తుందని గోడలను కూల్చేస్తే.. ఇప్పుడు వర్షాలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. తప్పని పరిస్థితుల్లో ముందు ఉన్న రేకుల షెడ్డు కిందే గడుపుతున్నాం.' అని వాపోతోంది. మా మీద సర్కారు దయ చూపాలని వేడుకుంటోంది.

గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిబంధనల కొర్రీలు లబ్ధిదారుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. ప్రధానంగా 600 చదరపు అడుగుల (ఎస్‌ఎఫ్‌టీ) కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు నిర్మిస్తే ఇందిరమ్మ పథకం వర్తించదని అధికారులు తేల్చిచెబుతుండడంతో ఎటూ తేల్చుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో ఎక్కువ మొత్తంలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా వేచి చూస్తున్నారు. మరోవైపు అర్హుల జాబితాలో చేర్చి, ఆపై తీసేయడం.. పక్కా ఇళ్లలో అద్దెకుంటున్న వారికీ మొండిచేయి చూపడంతో పలువురు ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతిబంధకాలుగా మారిన నిబంధనలతో ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఇబ్బందిపడుతున్న లబ్ధిదారులు, ఆశావహుల తీరొక్క గోడుపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

జిల్లాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల వివరాలు..

జిల్లా	మంజూరు	ప్రొసీడింగ్స్ అందుకున్నవి
మహబూబ్‌నగర్	10,904	10,426
నాగర్‌కర్నూల్	8,525	8,216
నారాయణపేట	5,233	5,233
వనపర్తి	6,538	5,861
జోగుళాంబ గద్వాల	6,488	6,488

600 ఎస్‌ఎఫ్‌టీల కొర్రీతో..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 37,688 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 36,224 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. అయితే నిబంధనల ప్రకారం 400 నుంచి 600 ఎస్‌ఎఫ్‌టీల మేరకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే నిబంధనపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలకు తాము కొంత కలుపుకుని ఇంటిని పెద్దగా నిర్మించుకుందామంటే.. కొర్రీలు పెడుతున్నారని వాపోతున్నారు. నిరుపేదలం.. ఒక్కసారి ఇళ్లు నిర్మించుకోవడమే గొప్ప.. అని ఈ మేరకు అవకాశం ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొంత మేర నిబంధనలను సడలించి అవకాశం ఇచ్చిందని.. ఇప్పుడూ అదేవిధంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా.. 600 ఎస్‌ఎఫ్‌టీల నిబంధన నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో 12 మంది లబ్ధిదారులు ప్రొసీడింగ్‌లను వాపస్ చేశారు.

కిరాయిదారుల్లో అసంతృప్తి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఆ తర్వాత అర్హుల లెక్క తేల్చేందుకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి పూర్తిస్థాయిలో వడపోసింది. విచారణ అనంతరం ఎల్–1, ఎల్–2, ఎల్–3 జాబితాను రూపొందించింది. మొదటి దశలో సొంతస్థలాలు ఉన్న దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. అయితే పక్కా భవనంలో అద్దెకుంటున్న వారిని లబ్ధిదారులుగా గుర్తించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇల్లు లేకనే అద్దెకు ఉంటున్నామని.. మేం ఎలా అర్హులం కాదో చెప్పాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అర్హుల జాబితాలో చేర్చి.. చివరలో మొండిచేయి చూపడంతో పలువురు నానాతంటాలు పడుతున్నారు. ఎలాగూ వస్తుందని భావించి ఇళ్లు కూల్చుకున్న వారు నరకయాతన అనుభవిస్తున్నారు.

పునాది కూల్చేస్తేనే బిల్లు ఇస్తామన్నారు..



మొదటి విడతలో నా పేరు మీద ఇందిరమ్మ ఇలులే మంజూరైంది. నాకున్న ఖాళీ స్థలంలో నింబంధనల ప్రకారం రెండు వరుసల పునాది వేశాం. అధికారులు పరిశీలనకు రాగా.. మేం ముగ్గు వేసిన తర్వాతనే పనులు ప్రారంభించాలని.. పునాది కూల్చివేయాలని చెప్పారు. ఆ తర్వాతే ముగ్గు పోస్తామని.. మళ్లీ పునాది నిర్మించిన తర్వాత బిల్లు మంజూరవుతుందన్నారు. లేదంటే ఇల్లు రద్దు చేస్తామని చెప్పారు. చేసేదేమీ లేక పక్కనే చిన్న పూరి గుడిసె వేసుకుని అప్పులు చేసి ఇంటి నిర్మాణ పనులు చేపట్టాం.
– లక్ష్మమ్మ, పల్లెగడ్డ, మరికల్, నారాయణపేట

బిల్లు అడిగితే స్పందించడం లేదు..



నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. నాకున్న ఖాళీ స్థలంలో అధికారులు 60 గజాలు కొలిచి ఇంటి నిర్మాణానికి ముగ్గు వేశారు. నాకు ఇద్దరు కుమారులు. దీంతో పక్కన మరింత ఖాళీ స్థలం ఉంటే ఇంటి నిర్మాణ పునాదిని విస్తరించాను. అధికారులు పరిశీలించి నిబంధనలు ఒప్పుకోవన్నారు. మేం ముగ్గు వేసిన వరకు నిర్మిస్తేనే బిల్లు మంజూరవుతుందని చెప్పారు. దీంతో వారు వేసిన ముగ్గు వరకే ఇల్లు నిర్మిస్తున్నా. గోడల పని పూర్తయింది. మొదటి బిల్లు ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. స్పందించడం లేదు.
– గోపాల్, పల్లెగడ్డ, మరికల్, నారాయణపేట

అటు రద్దు.. ఇటు లేఖలు..

ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో 600కు మించి ఎక్కువ ఎస్‌ఎఫ్‌టీల విస్తీర్ణంలో ఇల్లు కట్టుకున్న పలువురి ప్రొసీడింగ్‌లను అధికారులు రద్దు చేశారు. మరికొన్ని చోట్ల పునాది వరకు 600 ఎస్‌ఎఫ్‌టీలకు మించి ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టినా.. స్లాబ్‌లెవల్ 600కు మించకుండా చూస్తామని లబ్ధిదారుల నుంచి రాతపూర్వక లేఖలు తీసుకున్నారు. ఇందులో కొందరికి మొదటి విడత బిల్లులు చెల్లించగా.. మరికొందరికి రాలేదు. ఉమ్మడి పాలమూరులో ఒక్కో జిల్లాకు ఒక్కో రీతిలో అధికారులు వ్యవహరిసుండడంతో లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయంలో ఏమైనా మార్పు ఉంటుందనే ఆలోచనతో చాలా మంది నిర్మాణాలు చేపట్టకుండా వేచిచూస్తున్నట్లు 'సాక్షి' పరిశీలనలో తేలింది.

ఎమ్మెల్సీ కవిత మాటలు బాధ్యతా రాహిత్యం

నారాయణపేట: పేట– కొడంగల్ ఎత్తిపోతల పథకంపై తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని, ఈ ప్రాంత రైతుల ఆశలపై నీళ్లు చల్లే ప్రయత్నాలు మానుకోవాలని మార్కెట్ చైర్మన్ శివారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా ప్రత్యేక రాష్ట్రం సాధించామని చెప్పే బీఆర్‌ఎస్ నాయకులు నేడు కానుకుర్తికి వచ్చి ప్రాజెక్టుపై రైతులను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేశారని, ఇది చాలా బాధాకరమన్నారు. ప్రాజెక్టు కోసం ఈ ప్రాంత మేధావులు, రైతులు, అన్నివర్గాల ప్రజలు ఏళ్ల తరబడి పోరాటం చేశారని, నిర్మాణం పూర్తయితే నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లోని లక్షకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతుందని.. ఊట్కూర్, పేరపళ్ల జాయమ్మ చెరువు, కానుకుర్తి రిజర్వాయర్ల ద్వారా చెరువులు నింపే పథకమన్నారు. బాధితులకు చరిత్రలో ఎప్పుడూ లేనంత వేగంగా నష్ట పరిహారం అందిస్తారని.. ఎవరూ బలవంతంగా భూములు ఇవ్వడం లేదని, కోర్టు మార్గం అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ప్రాజెక్టుపై అవగాహన లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తూ అమాయక రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తూ రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. పాలమూరు–రంగారెడ్డి ద్వారా కాల్వల నిర్మాణం చేయకుండానే నీళ్లు ఇస్తామంటూ మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రైతులను మోసం చేస్తే ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నేతృత్వంలో ప్రాజెక్టు రూపుదిద్దుకోనుందని చెప్పారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, దామరగిద్ద మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఈదప్ప, ఎండీ గౌస్, శ్రీనివాస్, శరణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రానికి అన్యాయం చేస్తే ఊరుకోం



- పేట– కొడంగల్ నిర్వాసితులకు న్యాయం చేసే దాకా పోరాటం
- ఎకరాకు రూ.40 లక్షల పరిహారం ఇవ్వాలి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

– నారాయణపేట/దామరగిద్ద

వివరాలు 8లో ▸

మహిళా రైతు కన్నీరు తుడుస్తున్న ఎమ్మెల్సీ కవిత ⟶

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం



బాబూ జగ్జీవన్‌రాం కాలనీలో పాఠశాలను ప్రారంభించి మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

- రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణంలోని బాబూ జగ్జీవన్‌కాలనీ, బీసీకాలనీల్లో ఏళ్లుగా పాఠశాలలు లేకపోవడంతో మంత్రి ప్రత్యేక చొరవతో కొత్తగా మంజూరు చేయించి గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆయా కాలనీల్లో ఏళ్లు పాఠశాలలు లేకపోవడంతో విద్యార్థులు చాలా నష్టపోయారని.. సమస్య తన దృష్టికి రావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి మంజూరు చేయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యం ఇస్తోందని.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మించనున్నామని.. దండు గ్రామానికి చెందిన 9 మంది రైతులు పాఠశాల నిర్మాణానికి భూమి ఇచ్చారని, ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.833.50 కోట్లు మంజూరయ్యాయని, ఏడాదిలో పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.15.13 కోట్లు మంజూరుకాగా పనులు పూర్తి చేసినట్లు వివరించారు. అంతకు ముందు విద్యార్థులకు పలుకలు పంపిణీ చేశారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు మంత్రికి వివరించగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం జీఓనంబర్ 317 రద్దు చేసి సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ హన్మంతు, ఎంఈఓ అనిల్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు కోళ్ల వెంకటేష్, రవికుమార్, బోయ నర్సింహ, రాజేందర్, అనంద్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూర్యచంద్ర, హైమావతి, పరందారాములు, నాగరాజు, మారెప్ప, నారాయణ, గోవర్ధన్, నీలప్ప, దండు రాము, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేట రూరల్: బాలికలు బాలుర కంటే ముందుండి విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆకాంక్షించారు. జిల్లాకేంద్రంలో మహిళ, శిశు సంక్షేమశాఖ పరిధిలో కొనసాగుతున్న మహిళా సాధికారత కేంద్రంలో గురువారం అథ్లెటిక్స్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేసి మాట్లాడారు. బేటీ బచావో.. బేటీ పడావో పథకంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడలకు ప్రభుత్వం ప్రత్యేక స్థానం కల్పించిందని.. వినూత్న కార్యక్రమాలతో బాలికా విద్యను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేష్, పీఈటీ సాయినాథ్, అక్తర్ పాషా, ఖేలో ఇండియా కోచ్ హారికదేవి, మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త నర్సింహులు, జెండర్ స్పెషలిస్టులు అనిత, నర్సింహ, క్రికెట్ కోచ్ అజయ్, అథ్లెటిక్స్, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అత్తాకోడళ్లవి వెన్నుపోటు రాజకీయాలు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/ధన్వాడ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీలో వెన్నుపోటు రాజకీయాలు చేశారని ఇటీవల పాలమూరులో జరిగిన సభలో ఎంపీ డీకే అరుణ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ధన్వాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కోడలు పర్ణికారెడ్డి గెలుపునకు ఎంపీ తెర వెనుక మద్దతు తెలుపారని.. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో అత్త ఎంపీ డీకే అరుణకు తెర వెనుక మద్దతు తెలిపి కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థికి వెన్నుపోటు పొడిచిందెవరో నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అత్తాకోడళ్ల సొంత ఊరు ధన్వాడ అని చెప్పుకొంటున్నారని.. ఏడాదిన్నరలో ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి శూన్యమని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మంత్రులు పంచాయతీ ఎన్నికలపై తలోమాట మాట్లాడుతూ కాలం వెళ్లదీస్తున్నారే తప్పా నిర్వహణకు ముందుకు రావడం లేదన్నారు. ధన్వాడ పెద్ద చెరువులో ఒండ్రుమట్టి తరలింపు నీరు నింపేందుకా లేక జేబులు నింపుకొనేందుకా అని ప్రశ్నించారు. పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా ఎక్కడి నుంచి నీళ్లు వస్తాయో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. పార్టీలో అంతర్గత విభేదాలను పక్కనబెట్టి స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థులే గెలుపొందేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులే ఉన్నారని.. కష్టపడితే ఊరూరా గులాబీ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కావలి భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు వాహిద్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, దామోదర్‌రెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు బైకులు ఢీ: వృద్ధుడి దుర్మరణం


బాలయ్య (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుంటూరు గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొన్న ఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. గురువారం గ్రామానికి చెందిన బూడిద బాలయ్య(65) బైక్‌పై పొలం నుంచి పాలు తీసుకొని గ్రామానికి వస్తున్న నేపథ్యంలో శంకరయ్య అనే వ్యక్తి బైక్‌తో ఢీకొట్టడంతో బాలయ్య కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


చెన్నయ్యగౌడ్ (ఫైల్)

ధన్వాడ: విద్యుత్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ధన్వాడ మండలంలోని గున్ముక్ల గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెన్నయ్యగౌడ్(56) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం రాత్రి ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంక్‌లో నీరు నింపేందుకు మోటార్ ఆన్ చేసేందుకు ప్లగ్‌ను స్విచ్ బోర్డులో పెడుతుండగా ప్రమాదవశాస్తు విద్యుత్ షాక్ కొట్టి పడిపోవడంతో కుటుంబ సభ్యులు మరికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య సినామ్మ ఫిర్యాదు మేరకు ధన్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానవపాడు: ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి తీసుకెళ్లిన యువకుడి తండ్రితో ఆమె బంధువులు ఫోన్‌లో అన్న మాటలకు మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన బలికిన హేమలమ్మ, జమ్మన్నల కుమారుడు బలికిన వీరేంద్ర రేవతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకోవడానికి ఆమెను తీసుకెళ్లాడు. దీంతో అమ్మాయి బంధువులు జల్లాపురం దావీదు, కర్నూల్‌కు చెందిన సుధాకర్, రాము, బీచుపల్లి, రాముడు కలిసి వీరేంద్ర తండ్రి జమ్మన్నకు ఫోన్ చేసి కొడుకు తీసుకెళ్లిన అమ్మాయిని తీసుకరావాలని హెచ్చరించారు. వాళ్ల మాటలకు జమ్మన్న(45) మనస్తాపానికి గురై మంగళవారం పురుగు మందు తాగాడు. వెంటనే చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన భార్య హేమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీళ్లు తెచ్చేందుకు వెళ్లి శవమై తేలాడు

పెద్దకొత్తపల్లి: బావిలో నీళ్లు తెచ్చేందుకు వెళ్లి యువకుడు శవమై తేలిన ఘటన మండలంలోని పెద్దకారుపాములలో జరిగింది. గ్రామానికి చెందిన ఎండీ ఆసిఫ్(22) అనే యువకుడు పొలం పనులకు వెళ్లి బావి వద్దకు నీళ్లు తెచ్చేందుకు వెళ్లి మూర్ఛ రావడంతో బావిలో పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బిక్కు, హాజీయాబేగం దంపతుల కుమారుడు ఆసీఫ్ కూలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గోవింద్ అనే రైతు వ్యవసాయ పొలంలో గుంటక తోలడానికి వెళ్లాడు. మధ్యాహ్న భోజన సమయంలో నీళ్లు తెచ్చేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా మూర్ఛ రావడంతో బావిలో పడి మృతి చెందాడు. యువకుడి మృతి విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

కొత్త వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి



మహబూబ్‌నగర్ క్రైం: నగరాల్లో ఇతర ప్రాంతాల నుంచి అద్దెకు నివాసం ఉండటానికి కొత్త వారు ఎంతో మంది వస్తుంటారని, అలాంటి వాళ్లకు ఇళ్లను అద్దెకు ఇచ్చే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బండ్లగేరి ఏరియాలో గురువారం కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మొత్తం 210 ఇళ్లు తనిఖీ చేసి ఆయా ఇళ్లలో నివాసం ఉండే వారి ఐడెంటీ పత్రాలు పరిశీలించారు. ఈ క్రమంలో 15 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను ఎలాంటి పత్రాలు లేకుండా అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీస్ అన్ని రకాల చర్యలు చేపడుతుందని తెలిపారు. పోలీసులు పలు రకాల అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ అప్పయ్య, ఎస్‌ఐ శీనయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేస్తే ఊరుకోం


కానుకుర్తిలో భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

- పేట- కొడంగల్ నిర్వాసితులకు న్యాయం చేసే దాకా పోరాటం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

నారాయణపేట/దామరగిద్ద/అమరచింత: తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్ల కోసమని.. అలాంటి రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. పేట- కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులు గురువారం దామరగిద్ద మండలం కానుకుర్తిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆమె హాజరై రైతులకు మద్దతు తెలిపి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ఎండాకాలంలోనూ చెరువులు నింపుకొన్నాం.. కానీ, ఇప్పుడు వర్షాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా చెరువులు నింపుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఉత్తర తెలంగాణ ప్రజలకు వరప్రధాయినిగా కాళేశ్వరం ఉన్నట్లు.. దక్షిణ తెలంగాణకు ఎంతో మేలు చేయాలనే దూరదృష్టితో కేసీఆర్ పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును చేపట్టారన్నారు. ఈ ప్రాజెక్టు పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 13 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. కొడంగల్, పేట నియోజకవర్గాల్లో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి కేవలం లక్ష ఎకరాలకే సాగునీరు అందించేలా మార్చారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొడంగల్ నియోజకవర్గానికి సాగునీరు తీసుకుపోవడం మంచిదే.. కానీ, మధ్యలో ఉండే నారాయణపేట, దామరగిద్ద, ఊట్కూర్ ప్రాంతాల రైతులకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని ప్రశ్నించారు. జూరాల నుంచి కాకుండా భూత్పూర్ రిజర్వాయర్ నీటిని పైప్‌లైన్ ద్వారా తీసుకువస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే భీమా ప్రాజెక్టులో నీటి లభ్యత లేకుండా పోతుందని, ఫలితంగా మక్తల్ ప్రాంతానికి సాగునీరు అందే పరిస్థితి ఉండదన్నారు.

ఊళ్లు ముంచుడు ఎందుకో..

కేసీఆర్ ప్రభుత్వంలో మల్లన్నసాగర్ నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారని, అదేవిధంగా పేట- కొడంగల్ ఎత్తిపోతల పథకంలో కూడా భూములు కోల్పోయే వారికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి.. ఎకరాకు రూ.35-40 లక్షల పరిహారం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. అంతే కాకుండా భూములు కోల్పోయే గ్రామస్తులకు ఇళ్లు, భూములు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. రూ.20 లక్షలు పరిహారం ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా స్థానిక అధికారులు రూ.14 లక్షలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నీళ్ల రాని ప్రాజెక్టు కోసం ఊళ్లు ముంచుడు ఎందుకో ఆలోచించాలన్నారు. కానుకుర్తి గ్రామ ప్రజల పక్షాన తాను నిలబడతానని పేర్కొన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని.. మన పాలమూరు కంట కన్నీరు కారకుండా చూసుకోవాల్సిన బాధ్యత సీఎందేనన్నారు.

రైతుల కన్నీటి గోస

తమకు సంఘీభావం ప్రకటించేందుకు వచ్చిన ఎమ్మెల్సీ కవిత ఎదుట నిర్వాసిత రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ఒకే కుటుంబంలో 10-15 ఎకరాల భూమి కోల్పోతున్నామని రైతులు బోరున విలపించగా ఆమె వారిని ఓదార్చారు. రైతులు సమ్మతించే విధంగా పరిహారం అందే వరకు వెన్నంటి ఉంటానని, ఎవరూ బాధపడొద్దని పేర్కొన్నారు. అంతకు ముందు కాన్‌కుర్తికి వచ్చిన ఎమ్మెల్సీ కవితకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సుభాష్, బాపన్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, గున్ముక్ల గౌని శ్రీనివాసులు, నాయకులు జ్ఞానేశ్వర్, కృష్ణారెడ్డి, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు. కాన్‌కుర్తిలో గ్రామ సభ ముగిసిన అనంతరం గద్వాలలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతూ ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై ఆగి.. నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణానదికి కవిత పూజలు చేశారు.

అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం


మంత్రి వాకిటి శ్రీహరి ఎదుట ఎమ్మెల్యే విజయుడితో వాగ్వాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- అలంపూర్‌లో మంత్రి, అధికారుల ఎదుట నేతల వాగ్వాదం
- ఉద్రిక్తంగా సాగిన మంత్రి వాకిటి పర్యటన

అలంపూర్: అధికార, ప్రతిపక్ష పార్టీల నేత మధ్య రగడ నెలకొంది. స్థానికంగా పట్టు కోసం నువ్వా నేనా అన్నట్లుగా అధికార ప్రతిపక్ష నేతలు పోటీపడ్డారు. సజావుగా సాగాల్సిన మంత్రి పర్యటన ఉద్రిక్తతలకు దారిసింది. అలంపూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి వాకిటి శ్రీహరి హాజరయ్యారు. మంత్రికి స్వాగతం పలికేందుకు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ అలంపూర్ చౌరస్తాకు రాగా.. అదే సమయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన స్థానిక ఎమ్మెల్యే విజయుడి మంత్రికి స్వాగతం పలికేందుకు వచ్చారు. ఈ క్రమంలో ఓ పోలీస్ అధికారికి ఎమ్మెల్యేకు కొంత వాదనలు జరిగింది. మంత్రికి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. ఈ క్రమంలో జరిగిన పరిణామాలతో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సభావేతాక వద్దకు వెళ్లకుండా బయటే ఉండిపోయారు. సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ కాంగ్రెస్‌లోని స్థానిక నేతలు కమీషన్ల దందా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మట్టి, ఇసుకతో పాటు ప్రతి దానికి ఒక రేట్ కట్టి వసూళ్లు చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. అనంతరం మార్కెట్ చైర్మన్ దొడ్డెప్ప మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ 18 నెలల పాలనలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇచ్చిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తర్వాత మంత్రి మాట్లాడాల్సి ఉండగా మార్కెట్ యార్డు చైర్మన్‌కు ఎలా ఇస్తారని ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఆరోపణలు మరోసారి ప్రస్తావించారు. దీంతో ఇటు ఎమ్మెల్యే.. అటు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ బీఎం సంతోష్ ఇరువురిని వారించి నచ్చజెప్పారు. అనంతరం అన్నదాన సత్రం ప్రారంభోత్సవంలో ఎవరికి వారు అన్నట్లుగా వ్యవహరించారు. ముందుగా ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఆ తర్వాత ఎమ్మెల్యే, చివరగా సాయంత్రం మంత్రి అన్నదాన సత్రంలో పూజలు చేశారు. ఇలా ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటాపోటీగా మాటల యుద్ధం, వాగ్వాదాలతో మంత్రి పర్యటన ముగిసింది.

బీసీ రిజర్వేషన్‌పై కేంద్ర మంత్రులు స్పందించాలి


అచ్చంపేటలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అచ్చంపేట రూరల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజస్తాన్, గుజరాత్ రాష్ట్రాల్లో అమలవుతున్నట్టుగా తెలంగాణలోనూ ఆర్డినెన్స్ తీసుకొచ్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్రం సహకరించాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యంతో పాకిస్తాన్, ఇండియా మధ్య యుద్ధం ఆగిందని అనేకసార్లు ప్రకటించారని, దీనిపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఇద్దరు బీజేపీ కేంద్ర మంత్రులు ఉన్నారని, కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి బీసీ రిజర్వేషన్ అమలు చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని, ఆ హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా.. ఇచ్చిన హామీలను అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం చేస్తుందని, దీనిపై ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో గ్రామస్థాయిలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పర్యటించి స్థానిక సమస్యలను అధ్యయనం చేసి ఎక్కడికక్కడ ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. అప్పటికీ స్పందించకపోతే రాష్ట్రస్థాయిలో భారీ ఎత్తున ప్రజా పోరాటాలు తప్పవని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, వెంకట్రాములు, ధర్మానాయక్, పర్వతాలు, దేశ్యానాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు భారీ వరద


జూరాల నుంచి 18 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

- ప్రాజెక్టుకు 2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 18 క్రస్టు గేట్ల ఎత్తివేత.. దిగువకు 2.8 లక్షల క్యూసెక్కులు విడుదల

ధరూరు/ రాజోళి/ ఆత్మకూర్: ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీ ఎత్తున వరద నీరు వస్తుంది. బుధవారం ప్రాజెక్టుకు 1.78 లక్షల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం రాత్రి 8 గంటల వరకు 2.01 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుత సీజన్‌లో ఇంత పెద్దఎత్తున వరద రావడం ఇదే మొదటిసారి. దీంతో ప్రాజెక్టు వద్ద 18 క్రస్టు గేట్లను ఎత్తి గేట్లను ఎత్తి దిగువకు 1,79,316 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 25,205 క్యూసెక్కులు వదులుతున్నారు. అలాగే కోయిల్‌సాగర్ ఎత్తిపోతలకు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 650, సమాంతర కాల్వకు 800, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు వదలగా.. 43 క్యూసెక్కులు ఆవిరైంది. మొత్తం ప్రాజెక్టు నుంచి 2.08 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.914 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. ఎగువనున్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 1,57,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువకు 1.40 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. అలాగే నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.35 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.

■ జూరాలలోని ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో గురువారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధించామన్నారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

సుంకేసులకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. రెండు రోజులుగా లక్ష క్యూసెక్కులకు పైగా కొనసాగిన ఇన్‌ఫ్లో గురువారం 72 వేల క్యూసెక్కులకు చేరింది. దీంతో అధికారులు 18 గేట్లను ఒక మీటరు మేర తెరిచి 69,138 క్యూసెక్కులను దిగువకు, కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయం గురువారం పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండను తలపిస్తోంది. సముద్ర మట్టానికి పైన 1,021 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జలాశయానికి జూరాల ఎడమ కాల్వ నుంచి 1,184 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 775 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 1,040 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 45 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 273 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు.

జడ్చర్లలో సినీ ఫక్కీలో దోపిడీ

4 కిలోల వెండి, రూ.4 లక్షల నగదు అపహరణ

జడ్చర్ల: పట్టణ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో భోజనం కోసం ఓ దాబా వద్ద ఆగిన ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ఉన్న బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు సినీ ఫక్కీలో అపహరించిన ఘటన చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి ఓ వెండి నగల వ్యాపారి తమిళనాడులోని సేలంలో వెండి ఆభరణాలు చేయించేందుకు తన బ్యాగులో రూ.4 లక్షల నగదుతో పాటు 4 కిలోల వెండి తీసుకొని మధురైకి వెళ్తున్న బస్సు ఎక్కాడు. జడ్చర్ల సమీపంలో గల మాచారం వద్ద గల ఓ దాబా వద్ద రాత్రి భోజనం కోసం బస్సు నిలపగా.. వ్యాపారి తన బ్యాగును సీటులో పెట్టి కిందకు దిగి అరటి పండ్లు తిని బస్సు ఎక్కి సీటులో చూస్తే బ్యాగు కనిపించలేదు. అయితే కారు లేదా మోటార్‌బైక్‌పై వచ్చిన వ్యక్తులు బస్సులో ఉన్న బ్యాగును అపహరించుకొని పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

డ్యాం గేట్ల రోప్‌ల పరిశీలన


రోపులను పరిశీలిస్తున్న డ్యాం సిబ్బంది

రాజోళి: సుంకేసుల డ్యాం గేట్లకు ఉన్న రోప్‌ను పరిశీలించి ముందస్తుగా చర్యలు చేపట్టారు. వరద ఉధృతి ఎక్కువగా వస్తుండటంతో డ్యాం గేట్లను అప్పటికే పరిశీలించిన అధికారులు, అనుసంధానంగా ఉన్న రోపులను పరిశీలించారు. గత రెండు రోజులుగా లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చిన వరద కారణంగా రోపులు దెబ్బతిన్నాయా అన్న కోణంలో చర్యలు చేపట్టారు. గురువారం ఎగువ నుంచి వస్తున్న వరద కొంత తగ్గుముఖం పట్టడంతో అవసరమైన చోట పనులు చేపట్టారు. నదికి వస్తున్న వరద కారణంగా రోపులను పరిశీలించి ముందస్తు మరమ్మతులు చేపడుతున్నట్లు జేఈ మహేంద్ర పేర్కొన్నారు.

పరీక్షల కోసం వెళ్తే ప్రాణం తీశారు..


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు, సంఘాల నాయకులు

శ్రావణి (ఫైల్)

- తీవ్ర రక్తస్రావంతో బాలింత మృతి
- మగబిడ్డకు జన్మనిచ్చి.. తనువు చాలించిన వైనం
- ఆస్పత్రి ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన

అచ్చంపేట రూరల్: వైద్య పరీక్షల కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన నిండు గర్భిణికి హడావుడిగా సిజేరియన్ చేయడంతో తీవ్ర రక్తస్రావమై మృతిచెందింది. ఈ దుర్ఘటన అచ్చంపేట పట్టణంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లికి చెందిన గర్భిణి శ్రావణి (22) బుధవారం వైద్య పరీక్షల నిమిత్తం అచ్చంపేటలోని ఎంఎంఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యుడు కడుపులో బిడ్డ ఉమ్మనీరు మింగిందని.. వెంటనే ఆపరేషన్ చేయకపోతే తల్లీబిడ్డ ప్రాణాలకే ప్రమాదమని కుటుంబ సభ్యులకు చెప్పాడు. రెండు ప్రాణాలకు ఆపాయం ఉండటంతో వారు సిజేరియన్‌కు ఒప్పుకొన్నారు. అయితే మగబిడ్డకు జన్మనిచ్చిన శ్రావణికి కొంత సేపటికే అధిక రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. విషయం తెలుసుకున్న ఆస్పత్రి వైద్యుడు (జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త) తన స్వంత కారులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది.

బంధువుల ఆందోళన..

తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు ఎంఎంఆర్ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వారికి పలు సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఆస్పత్రి గుర్తింపు రద్దు చేయాలని, బాలింత మృతికి కారకులైన వైద్యుడు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రసవానికి పది రోజుల సమయం ఉన్నా.. డబ్బుల కోసం హడావుడిగా ఆపరేషన్ చేయడంతోనే శ్రావణి మృతి చెందిందని వారు ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట 6గంటల పాటు అంబులెన్స్‌లోనే శ్రావణి మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు.

ఏడాదిక్రితమే వివాహం..

శ్రావణి స్వగ్రామం అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీ. అయ్యవారిపల్లికి చెందిన ఎల్లస్వామితో ఏడాది క్రితమే శ్రావణికి వివాహం కాగా.. జూలై 25న పెళ్లి రోజు వేడుక జరుపుకొన్నారు. అయితే మొదటి కాన్పులో మగశిశువుకు జన్మనిచ్చిన శ్రావణి గంటల వ్యవధిలోనే మృతిచెందడం కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చింది.

రూ. 9లక్షలకు ప్రాణం ఖరీదు..

మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు పెద్దఎత్తున ప్రైవేటు ఆస్పత్రికి వస్తున్నారన్న విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులతో సెటిల్‌మెంట్ చేసుకోవాలని సదరు ఆస్పత్రి వైద్యుడిపై పోలీసులే ఒత్తిడి తేవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. బాలింత ప్రాణం ఖరీదు రూ. 9లక్షలకు సెటిల్ అయినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్‌ఐ విజయభాస్కర్‌ను వివరణ కోరగా.. మృతురాలి తల్లి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అంతా మా ఇష్టం!

- అధికారులు వచ్చినప్పుడు హడావుడి
- యథేచ్ఛగా రైతుల పొలాల్లోకి కాలుష్య జలాలు
- పోలేపల్లి సెజ్‌లో మారని ఫార్మా పరిశ్రమల తీరు


సెజ్‌లోని ఓ పరిశ్రమ నుంచి బయటి వదులుతున్న కాలుష్యపు పొగ


కాలుష్యపు నీటిని బయటికి వదులుతున్న అనుమతులు రాని ఫార్మా కంపెనీ

రాజాపూర్: పరిశ్రమల నుంచి కాలుష్యాన్ని బయటకు వదలకూడదని ఇటు అన్ని శాఖలతో పాటు కాలుష్య నియంత్ర బోర్డు అధికారులు యాజమాన్యాలను హెచ్చరిస్తున్నా.. పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమల తీరు మారడం లేదు. అధికారుల వచ్చి హడావుడి చేసినా యాజమాన్యాలు పరిశ్రమల నుంచి కాలుష్య జలాలను రైతుల పొలాల్లోకి యథేచ్ఛగా వదులుతున్నారు. ఇప్పటికే పోలేపల్లి సెజ్ చుట్టూ పొలాలున్న రైతులు గతకొన్ని సంవత్సరాలుగా పరిశ్రమలు వదులుతున్న జల, వాయు కాలుష్యాల మూలంగా పంటలు పండక, జన జీవరాసులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాలపై ముదిరెడ్డిపల్లి, రాయపల్లి, పోలేపల్లి రైతులు సంబంధిత అధికారులకు ఎన్నో పర్యాయయాలు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. అయితే అధికారులు వచ్చినప్పుడు పరిశ్రమల్లో నుంచి బయటికి కాలుష్యం వదలకుండా జాగ్రతలు తీసుకుంటారు. మరుసటి రోజే కాలుష్యాన్ని బయటికి వదలడం పరిపాటిగా మారింది. ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌కు సమీప గ్రామాల రైతులు ఫిర్యాదు చేశాయగా.. కలెక్టర్ సంబంధిత అన్ని శాఖలను కలిపి కమిటీ వేశారు. దీంతో మంగళవారం అధికారుల బృందం సెజ్‌లోని పరిశ్రమలు, రైతుల పొలాలను పరిశీలించి నీటి శ్యాంపిల్లను తీసుకువెళ్లారు. అధికారులు వచ్చి 24గంటలు కాకముందే సెజ్‌లోని పరిశ్రమల నుంచి జల, వాయుకాలుష్యాన్ని వదులుతున్నారు. ఇటీవల పూర్తి అనుమతులు కూడా రాని ఓ ఫార్మా కంపెనీ ట్రయల్‌రన్ ను చే కాలుష్యపు నీటిని బయటికి వదులుతున్నారు.

జువైనెల్ కోర్టుకు లైంగిక దాడి నిందితులు

జడ్చర్ల: ఏడేళ్ల చిన్నారిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఐదుగురు మైనర్ బాలురను గురువారం అరెస్ట్ చేసి మహబూబ్‌నగర్ జువైనెల్ కోర్టులో హాజరు పరచినట్లు స్థానిక సీఐ కమలాకర్ తెలిపారు. లైంగిక దాడికి గురైన బాలికకు వైద్య చికిత్సల అనంతరం తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తమ అమ్మానాన్నలను చూసే ఇటువంటి అఘాయిత్యానికి పాల్పడ్డామని ఓ నిందితుడు పోలీసుల విచారణలో చెప్పడం గమనార్హం.